# వర్కర్స్ యూనిటీ జిందాబాద్

హైద్రాబాద్‌నుంచి రామచంద్రాపురానికి వెళ్ళేదారిలో ఉన్న ఓ లిమిటెడ్ కంపెనీ ఫేక్టరీ అది. ఆ ఫేక్టరీ ముందున్న ఆఫీస్ బిల్డింగు లోని వర్క్స్ డైరెక్టర్ ఆఫీస్‌గది అది. ఆ గదిలో ఆయనతోపాటు మరొక ఇద్దరున్నారు. ఆ ఇద్దరూ ఆ కంపెనీ వర్కర్స్ యూనియన్ లీడర్లు. ఒకతని పేరు ఇంద్రసేనరావు, మరొకతని పేరు యాదగిరి.

గత పద్దెనిమిది రోజులుగా వారిద్దరి ఆధ్వర్యములో సమ్మె జరుగుతోంది. చాలాకాలంగా వర్కర్స్ యూనియన్ కోరుతున్న ఎనిమిది డిమాండ్స్‌ని మేనేజ్‌మెంట్ నిరాకరిస్తూండటం చేత సమ్మె నోటీసు జారీ చేశారు. మేనేజ్‌మెంట్ తమ డిమాండ్స్‌ని అంగీకరించకపోవడంతోసమ్మెలోకి దిగారు

పద్దెనిమిది రోజులుగా ఫ్యాక్టరీ ముందు రిలే నిరాహారదీక్ష చేస్తూ నినాదాలు చేస్తూ సమ్మె చేస్తున్నారు వర్కర్స్. వర్క్స్ డైరెక్టర్‌కి కంపెనీ చెయిర్‌మన్‌కీ భేదాభిప్రాయం రావటం వలన వర్క్స్ డైరెక్టర్ రాజీనామా చేశాడు. ఆయన స్థానంలో పార్వతీపతి అనే కొత్తవ్యక్తి నియమింపబడ్డాడు. ఈ నియామకం జరిగి అయిదు రోజులయింది. పాతవర్క్స్ డైరెక్టర్ వర్కర్స్ డిమాండ్స్‌లలో ఏ ఒక్కటీ అంగీకరించలేదు. ఆ రోజు పార్వతీపతికి, యూనియన్ లీడర్స్ ఇద్దరికీ సంప్రదింపులు జరుగుతున్నాయి.

పరిచయాలయాక పార్వతీపతి వాళ్ళ సమ్మె నోటీసుని, డిమాండ్స్‌ని పరిశీలించాడు. అందులో అయిదు డిమాండ్స్ చాలా చిన్నవి. వాటిని ఇదివరకే ఎందుకు అంగీకరించలేదో పార్వతీపతికి అర్థంకాలేదు.

"ఆడవాళ్ళకి ప్రత్యేకంగా లంచ్‌రూం ఏర్పాటు చేస్తాం, మీరు కోరినట్లుగానే చిన్న పార్టిషన్ వాల్ కడితేచాలు- పెద్ద ఖర్చేకాదు. మరో పాతిక సైకిళ్ళు పట్టే సైకిల్‌స్టాండ్ కట్టిస్తాం, వర్షాకాలంలో సైకిళ్లు తడిసి

పాడయిపోతాయన్న మాట వాసవమే, రోజూ ఉదయం పంచ్‌చేసే గడి యారాలని రేడియో సెంతో చూసి సరిచేస్తాం. అవి ఫాస్టుగా తిరిగే అవ కాశమే వుండదిక...."

యాదగిరి, ఇంద్రసేనరావులు మొదటి అయిదు డిమాండ్స్ వొప్పు కున్నందుకు సంతోషపడ్డారు.

తర్వాతి మూడింటిలో ఏ ఒక్కటి వొప్పుకున్నా కంపెనీకిఅదనంగా నెలనెలా ఖర్చుపెరుగుతుంది. యూనిఫాం ధరించే వర్కర్స్‌కి వాషింగ్ అలవెన్స్ పెంచటానికి పార్వతీపతి అంగీకరించాడు.

"థాంక్స్" చెప్పాడు ఇంద్రసేనరావు.

"మీలాంటివారి మేనేజ్‌మెంట్‌లో ఉండటం మా అదృష్టం" అన్నాడు యాదగిరి ఆనందంగా.

"మీ మిగతా రెండు డిమాండ్సుని కూడా వొప్పుకుంటున్నాను. రేపటినుంచి పనిలో దిగండి" చెప్పాడు పార్వతీపతి లెక్కలువేసి చూసు కొని.

సమ్మెవలన ఉత్పత్తి ఆగిపోయి వచ్చే నష్టంకంటే వాళ్ళ కోరికలు తీర్చడమే లాభదాయకంగా భావించాడు పార్వతీపతి.

యాదగిరి, ఇంద్రసేనరావులు ఒకరి మొహాలవంక మరొకరుచూసు కున్నారు తర్వాత పార్వతీపతిని అడిగారు నమ్మలేనట్లుగా।

"అన్నీ డిమాండ్సు వొప్పుకున్నారా?"

"అవును మరో నాలుగేళ్ళదాకా సమ్మె చేయమని మీరు వప్పు కుంటే వీటిని వెంటనే అమలు పరిచే ఏర్పాటు చేస్తాను"

యూనియన్ లీడర్స్ ఇద్దరి మొహాల్లో వెంటనే అసంతృప్తి ప్రవే శించడం గమనించి అడిగాడు పార్వతీపతి.

"ఇంకా ఏమిటి?"

"ఈ ఎనిమిదిలో మీరు కేవలం నాలుగు డిమాండ్స్ అంగీకరిస్తే చాలు ప్రస్తుతానికి"

"ఆదేం?" ఆశ్చర్యపోయాడు. పార్వతీపతి.

"అది అంతే మీరన్నీ వప్పుకుంటే నాలుగేళ్ళ దాకా మాకు వర్కర్స్‌లో విలువేం వుంటుంది?"

అయిదు నిముషాల తర్వాత బయటికి వచ్చి చెప్పారు ఇద్దరూ బయట వేచి వున్న సోదర కార్మికులతో,

"కామ్రేడ్స్ మన యూనియన్ తరపున గట్టిగా పోట్లాడి మొత్తానికి నాలుగు డిమాండ్స్‌ని అంగీకరించేలా చేసాం. ఇది మనకి పెద్ద విజయం. రేపటినించి పనిలో చేరుదాం. వర్కర్స్ యూనిట్ జిందాబాద్".

"వర్కర్స్ యూనియన్ జిందాబాద్ కామ్రేడ్స్ ఇంద్రసేనారావు జిందాబాద్, కామ్రేడ్ యాదగిరి జిందాబాద్" గొంతుచించుకుని అరిచారు. సోదర కార్మికులు సంతోషంగా.

## మందు

ఎర్రగడ్డలో ఒక సవారీ దించగానే, ఆటో డ్రయివరు వెంటనే మరో సవారీ దొరకడం తన అదృష్టంగా భావించాడు. ఆటో కోసం ఎదురు చూస్తున్న దాదాపు ఓ నలభై ఏళ్ళతను కంగారుగా అటో ఎక్కి "త్వరగా పోనీ" అన్నాడు.

"కహా జానా?" అడిగాడు ఆటో డ్రయివర్ హిందీలో – ఫ్లేగ్ దింపి.

"లక్‌డీ కా పూల్" చెప్పాడతను అదుర్దాగా ఆటో కొద్ది దూరం వెళ్ళగానే "ఓసారి ఆ మందుల షాపు దగ్గర ఆపు" అని కోరాడు ఆ ప్రయాణీకుడు వెనకసీట్‌లోంచి.